02032025-MAI-04_Layout 1 3/2/2025 4:01 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

హింసించే పులకేశిలా పరిపాలన!

శ్రీధర్ ప్రసాద్

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా తన పేరు ఖరారు కాగానే ప్రగతిభవన్ ముందు ఉన్న సెక్యూరిటీ గేట్లను తొలగించి 'గడీలను బద్దలు కొట్టాం, ఇది ప్రగతిభవన్ కాదు, ఇకనుంచి ప్రజా భవన్, రేపటి నుంచి ప్రజాదర్బార్ నిర్వహిస్తాం, ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలను చెప్పుకోవచ్చు, ఆ సమస్యలన్నీ చిటికెలో తేల్చేస్తాం' అని రేవంత్‌రెడ్డి వీరావేశంతో ప్రకటించారు. అంతే కాదు, 'ఇక నుంచి నేను వచ్చి, వెళ్లేటప్పుడు ఎక్కడా ట్రాఫిక్‌ను ఆపొద్దు, ఆపి ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు, నేను సీఎంను అయినా సామాన్య వ్యక్తిలానే తిరుగుతాను' అని ప్రకటించారు. రేవంత్ అనుకూల మీడియా, వందిమాగధులు రేవంత్ నిర్ణయాలను ఆకాశానికి ఎత్తేశారు. దీంతో మరింత రెచ్చిపోయిన రేవంత్ రెడ్డి 'ప్రతి రోజూ సచివాలయానికి వస్తాను. ప్రజలకు అందుబాటులో ఉంటాను' అని కూడా ప్రకటించారు.

ప్రజాభవన్ ముందు సెక్యూరిటీ కోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు తొలగించి వాటి స్థానంలోనే ముళ్ల కంచెలను వేశారు. ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి అక్కడ ఉండకుండా, అందులో ఉన్న రెండు భవనాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కలకు కేటాయించారు. గతంలో కేసీఆర్ సమావేశాలు నిర్వహించే జనహిత భవన్‌ను ప్రజాదర్బార్‌కు కేటాయించారు. ఇక సీఎం రేవంత్ అధికారిక నివాసం కోసం మొదట మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం అని, ఆ తర్వాత బేగంపేటలోని పైగా ప్యాలెస్ అని ప్రచారం చేశారు. ఏడాది దాటినా ఇంకా జూబ్లీహిల్స్‌లోని తన ప్యాలెస్ నుంచే రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారు. కంచెలు లేని పాలన అని ఊదరగొట్టిన రేవంత్‌రెడ్డి తన ఇంటికి రెండు కిలో మీటర్ల దూరం నుంచే బారికేడ్లు పెట్టి ఎవరినీ రాకుండా నియంత్రిస్తున్నారు. ఇక రోజూ సచివాలయానికి వస్తానని ప్రకటించిన రేవంత్ అసలు దానివైపే కన్నెత్తి చూడటం లేదు. సచివాలయంలో వాస్తు దోషం ఉన్నదంటూ గేట్లను మార్చడమే కాకుండా, 6వ అంతస్తును పూర్తిగా దిగ్బంధం చేశారు. ఆ అంతస్తులో రహస్యంగా మార్పుచేర్పులు చేస్తుండటం గమనార్హం. సచివాలయం ఎదురుగా, తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు. వాటిని పక్కదారి పట్టించడం కోసం సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు.

> **తెలంగాణ తల్లి విగ్రహంలో ఉన్న నగలు, కిరీటం తొలగించి తెలంగాణ తల్లిని పేద తల్లిగా ఏర్పాటు చేయడం, ఆ పేద తల్లే తెలంగాణకు ప్రతీక అని తనకు తాను ప్రకటించుకోవడం విడ్డూరం. ఇక అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ' పాటకు ఉద్యమ బాణీకి బదులు ఎం.ఎం.కీరవాణితో కొత్త బాణీ కట్టించి తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించడం, టీఎస్ (తెలంగాణ స్టేట్) స్థానంలో టీజీ అని మార్చడం, అందుకోసం వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేయడం గమనార్హం.**

ఈ ఏడాది పాలనలో టీఎస్ స్థానంలో టీజీ ఎందుకు పెట్టారు? బలవంతంగా రాజీవ్ గాంధీ విగ్రహం సచివాలయం ఎదుట పెట్టడానికి

కారణం ఏమిటి? ఆ తర్వాత హడావుడిగా సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటుచేయడం ఎందుకు? ఆ విగ్రహంలో కూడా మార్పులు చేయడానికి కారణం ఏమిటి? అన్న ప్రశ్నలకు ఒక్కదానికీ రేవంత్ వద్ద గానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద గానీ సహేతుకమైన సమాధానం లేకపోవడం గమనార్హం. ఇక రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు గానీ, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు గానీ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలు ఎవరూ రాకపోవడం, ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనించాల్సిన అంశం.

ఇక ఈ విషయాలన్నీ పక్కనపెట్టి 14 నెలల రేవంత్ రెడ్డి పాలన విషయానికి వస్తే అంతా బభ్రాజమానం, భజగోవిందం. హైదరాబాద్‌లో చెరువులు, కుంటల ఆక్రమణల తొలగింపు అంటూ హైడ్రాను తీసుకువచ్చారు. పద్నాలుగు నెలల కాలంలో పేదల ఇండ్లు కూల్చడమే లక్ష్యంగా శని, ఆదివారాలు హైడ్రా రేయింబవళ్లు పనిచేస్తున్నది. హైకోర్టు మొట్టికాయలు వేసినా రేవంత్ సర్కార్ పేదల ఇండ్లను కూల్చడం ఆపలేదు. ఇదిలా ఉంటే ఆ హైడ్రా పెద్దల ఇండ్ల వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. ఇక లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ అంటూ ఊదరగొట్టి ఏకంగా మంత్రులు, జర్నలిస్టులతో కూడిన బృందాన్ని అట్టహాసంగా సియోల్‌కు పంపి హడావుడి చేసిన రేవంత్ మూసీ పరీవాహక ప్రాంతంలో ఇండ్లను కూల్చేందుకు మార్కింగ్ చేయడం, కొన్ని ఇండ్లను కూల్చడంతో పలుపురు పేదలు ఆవేదనతో మరణించారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనికరం కలగలేదు. ఇక నుంచి పేదల ఇండ్లను కూల్చబోమని భరోసా ఇవ్వలేదు.

ఇక ట్రిపుల్ ఆర్ పేరుతో దక్షిణ భాగంలోని రహదారిలో చేస్తున్న మార్పుచేర్పులు, దాని కోసం లాక్కుంటున్న పేదల భూముల విషయంలో బాధితులు రగిలిపోతున్నారు. అవసరం లేని అత్యంత విశాల రహదారులు నిర్మిస్తూ తమ ఆస్తులను పెంచుకునేందుకు ప్రభుత్వ పెద్దలు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కేంద్రం చేపట్టాల్సిన ఈ రహదారికి సంబంధించిన డీపీఆర్ రాష్ట్ర ప్రభుత్వం తయారుచేయడమే మితని ప్రశ్నిస్తున్నారు.

ఇక రేవంత్ సొంత నియోజకవర్గం కొడంగల్‌లో మొదట ఫార్మా క్లస్టర్ పేరుతో లగచర్ల, దాని చుట్టుపక్కల తండాలలో గిరిజనుల భూములు లాక్కునేందుకు ప్రయత్నించిన ప్రభుత్వం గిరిజనులు, రైతులు తిరగబడటంతో రివర్స్ గేర్ వేసుకున్నది. అంతేకాదు, వారిని నిర్బంధించి, కేసులు పెట్టి 33 రోజుల పాటు జైలుపాలు చేసింది. దీంతో విషయం జాతీయ మానవ హక్కుల కమిషన్ దాకా వెళ్లింది. అయినా పేదల భూములను వదలకుండా ఫార్మా క్లస్టర్ స్థానంలో ఇండస్ట్రియల్ కారిడార్ అంటూ కొత్త రాగం ఎత్తుకొన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా వారిని వెంటాడుతూనే ఉన్నది. ఈ వేధింపులకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)

జయశంకర్ సార్ పేరే పెట్టాలె

ఏనుగుల రాకేష్ రెడ్డి

దశాబ్దాల నిరీక్షణ తర్వాత ఎట్టకేలకు మామునూరు విమానాశ్రయం ముందుకు కదలడం శుభపరిణామం. స్వాతంత్ర్యం కంటే ముందే దేశంలోనే అతిపెద్ద విమానాశ్రయంగా మన మామునూరు విమానాశ్రయం పేరుగాంచింది. అనేక రాష్ట్రాలకు విమానాశ్రయం లేనప్పుడే ఇక్కడ ఉన్నది. చైనా, భారత్ యుద్ధ సమయంలో సైతం ఉపయోగంలో ఉన్నది.

తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రతిపాదనలు పంపగా కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. రెండు ప్రభుత్వాలు పునరుద్ధరణ కోసం పనిచేశాయి. కానీ, అనేక కారణాల వల్ల పనులు అనుకున్న స్థాయిలో ముందుకు పడలేదు. ఆ కృషి ఫలితాలు ఇప్పుడు రావడం, ఎట్టకేలకు ఆమోదం పొందటం శుభపరిణామం. కానీ, దీన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దినప్పుడే ప్రయోజనకరంగా ఉంటుంది. డొమెస్టిక్ ఇచ్చి చేతులు దులుపుకొంటే తర్వాత దోమలు తోలుకోవడం తప్ప ప్రయోజనం ఏమీ ఉండదు. డొమెస్టిక్ విమానాశ్రయంగా అభివృద్ధి చేస్తే ఆంధ్రలో కడప, కర్నూల్ విమానాశ్రయాల వలె పడావు పడి నిరుపయోగంగా మారుతుంది. మామూనూరు విమానాశ్రయానికి కాకతీయుల పేరు లేదా ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు పెట్టాలి. ఈ ప్రాంతాన్ని 400 ఏండ్లు పాలించి, ప్రజలపై చెరగని ముద్ర వేసిన కాకతీయులు ఈ ప్రాంతానికి గర్వకారణం. కాబట్టి, విమానాశ్రయానికి కాకతీయుల పేరు పెట్టడమే సముచితం. లేదా, తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, ఓరుగల్లు బిడ్డ ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు పెట్టాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నది కదా అని మళ్లీ రాజీవ్ గాంధీ పేరో, రాహుల్ గాంధీ పేరో పెడితే వరంగల్ ప్రజల మనోభావాలతో ఆడుకున్నట్టే, ఇక్కడి ప్రజల ఆత్మగౌరవం దెబ్బతీసినట్టే అవుతుంది.

కాంగ్రెస్ పాపమే ఇన్నాళ్ల నిరీక్షణకు కారణం. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా తెచ్చిన జీఎంఆర్ ఒప్పందమే ఇన్నాళ్ల నిరీక్షణకు కారణం. కాబట్టి, ఇన్నేండ్లు కాంగ్రెస్ పార్టీ వరంగల్‌కు చేసిన పాపాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా చేసి కడుక్కోవాలి. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఏపీలో జాతీయ అంతర్జాతీయ విమానాశ్రయాలతో కలిపి 7, కర్ణాటకలో 6, కేరళలో 4, తమిళనాడులో 10, ఆఖరికి అతి చిన్న రాష్ట్రమైన గోవాలో సైతం 2 విమానాశ్రయాలున్నాయి. తెలంగాణలో మాత్రం కేవలం రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మాత్రమే నడుస్తున్నది. బేగంపేటలోని విమానాశ్రయాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా మూసివేయడం కారణంగా ప్రస్తుతం సైనిక శిక్షణ కోసం మాత్రమే వాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన జీఎంఆర్ ఒప్పందంతో ఉమ్మడి వరంగల్ జిల్లా దశాబ్దాల నిర్లక్ష్యానికి గురైంది, అభివృద్ధిలో వెనక్కి నెట్టబడింది. ఇది కొత్తగా తెచ్చిన విమానాశ్రయం కాదు, ఉన్నదాన్ని మూసివేసి, పునరుద్ధరణ చేస్తున్న విమానాశ్రయం మాత్రమే. కాబట్టి ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వడం మాని పనులను వేగవంతం చెయ్యాలి. వరంగల్ జిల్లాలో ఎన్నో పేరుగాంచిన పర్యాటక ప్రదేశాలున్నాయి. బొగత లాంటి జలపాతాలు, పాకాల, రామప్ప, లక్నవరం లాంటి సరస్సులు, దట్టమైన అడవులు అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప, వేయి స్తంభాల ఆలయాలు ఇలా అడుగడుగునా ఆధ్యాత్మికతతో పర్యాటకరంగం మరింత పుంజుకునే అవకాశం ఉంటుంది. టెక్స్‌టైల్ రంగం అభివృద్ధి చెందటానికి కూడా ఎన్నో అవకాశాలున్నాయి. ఇక్కడ పత్తి అధికంగా పండుతుంది. కాబట్టి, టెక్స్‌టైల్, అలాగే మన నేతన్నల కళా రూపాలను ఎగుమతి చేసే అవకాశం ఉంటుంది. మిర్చి, మక్కజొన్న పంటలకు కూడా కొదవ లేదు కాబట్టి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటుచేయడం ద్వారా మన రైతులు నేరుగా అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించే అవకాశం కలుగుతుంది.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మడికొండలో ఐటీ హబ్ ఏర్పాటుచేశారు. ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయం వస్తే మరింత వేగంగా ఐటీ రంగం ఉమ్మడి వరంగల్ జిల్లాకు విస్తరించే అవకాశం ఉంటుంది. అలాగే భూపాలపల్లి, రామగుండం, కొత్తగూడెంలో బొగ్గు పుష్కలంగా ఉండటం వల్ల వాటి సంబంధిత పరిశ్రమలకు సైతం ఉపయోగకరంగా ఉంటుంది. మౌలిక సదుపాయాలు పెరిగి అభివృద్ధి వేగవంతమవుతుంది.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు)

కూసాలు కదులుతున్నందుకే కేసులు

తోటకూర రమేశ్

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఫోబియా పట్టుకున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గులాబీ జెండాలు నిద్రపట్టనివ్వడం లేదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఫొటోలు ఆయనను ఉక్కిబిక్కిరి చేస్తున్నాయి. ప్రజల పక్షాన నిలబడిన ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై నిత్యం ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం నిత్యం వెంటపడుతుండటంతో కాంగ్రెస్ తట్టుకోలేకపోతున్నది.

తెలంగాణలో కాంగ్రెస్ కక్ష సాధింపు రాజకీయాలు పతాకస్థాయికి చేరాయి. ప్రతిపక్షంపై పగ, ప్రతీకారాలతో రేవంత్‌రెడ్డి రగిలిపోతున్నారు. ప్రజలు ఎన్నో అంచనాలతో కాంగ్రెస్‌కు పట్టంకడితే.. రేవంత్ మాత్రం రివేంజ్ పాలిటిక్స్‌కు తెరతీశారు. ప్రజాపాలన, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ అంటూ పెద్ద మాటలు చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ప్రజలకు, నాయకులకు మాట్లాడే హక్కు లేకుండా చేస్తున్నారు. ప్రభుత్వ విధానాలను విమర్శించినా, ప్రశ్నించినా తట్టుకోలేకపోతున్నారు. జర్నలిస్టులపై కేసులు, వేధింపులకు పాల్పడటమే కాదు.. మీడియా హౌస్‌లపై దాడులు చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారు.

ప్రజా పాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పోలీసు రాజ్యాన్ని తెచ్చింది. అధికారుల అవినీతి, నియంత పోకడలపై పాటలు పాడినా, మాట్లాడినా ఎన్‌కౌంటర్ చేస్తామని పోలీసులు బెదిరిస్తున్నారు. ఇలాంటివి ఎక్కువగా ఉమ్మడి ఏపీలోని టీడీపీ హయాంలో జరిగేవి. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అదే స్కూల్ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు అదే బాటలోనే పయనిస్తున్నారు. అధికారులను రాజ్యాంగేతర శక్తులుగా మార్చుతున్నారు.

> **రేవంత్‌రెడ్డి గుప్పిట్లో ఉన్న ప్రధాన మీడియా ప్రతిపక్షంపై విష ప్రచారం చేస్తుంటే, సోషల్ మీడియా మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏకిపారేస్తున్నది. ప్రజల ఆక్రందనలు, ఆవేదనను సోషల్ మీడియా కండ్లకు కడుతున్నది. ఇప్పుడీ సోషల్ మీడియా గొంతుకలు కూడా రేవంత్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. దీంతో వాటిని కూడా టార్గెట్ చేసిన ప్రభుత్వం అక్రమ కేసులతో దాడులు చేయిస్తున్నది.**

గులాబీ రంగు చూస్తేనే జంకుతున్న ప్రభుత్వం.. బీఆర్ఎస్ అంటేనే హడలిపోతున్నది. ప్రతిపక్షానికి సోషల్ మీడియా కూడా తోడు కావడంతో కాంగ్రెస్ కూసాలు కదులుతున్నాయి. 14 నెలల స్వల్ప కాలంలోనే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం సడలిపోయింది. సర్కారుపై వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతున్నది. దీంతో కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. ప్రజలు ఎక్కడ తిరగబడతారోనన్న భయంతో వెనకడుగు వేస్తున్నారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను హైడ్రాను అడ్డుపెట్టుకుని తొలగించారు. ప్రగతి భవన్‌లో కేసీఆర్ శిలాఫలకాన్ని కొందరు ధ్వంసం చేశారు. నల్లగొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేసీఆర్ ఫొటోపైనా ప్రతాపం చూపించారు. కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా స్కూల్లో విద్యార్థులకు చాక్లెట్లు పంచినందుకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. సిరిసిల్లలోని ఓ టీషాపులో కేటీఆర్ ఫొటో ఉండటంతో ఏకంగా దుకాణాన్నే తొలగించారు. గ్రామాల్లోనూ బీఆర్ఎస్ శిలాఫలకాలు ధ్వంసమవుతున్నాయి. చివరికి పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ ఫొటో ఉన్న పేజీని కూడా చింపేసి విద్యార్థులకు ఇస్తున్నారు. కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకు, ప్రజల మనసుల నుంచి కేసీఆర్‌ను దూరం చేసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేయాలో, అన్నీ చేసినా ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించడం లేదు.

> **నిజానికి తెలంగాణ ఉద్యమంలో ఎన్ని జెండాలు పుట్టుకొచ్చినా గులాబీ జెండామాత్రం పాతుకుపోయింది. ఆ జెండా అందరిలోనూ చైతన్యం నింపింది. ప్రజలను ఏకతాటిపై నడిపించింది. గులాబీ జెండా ప్రజల్లో సృష్టించిన విప్లవ చైతన్యం ఇప్పటికీ అలాగే ఉన్నది. దానిని నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం ఇప్పుడు కుటిల పన్నాగాలు పన్నుతున్నది.**

రేవంత్‌రెడ్డికి గులాబీ ఫ్లెక్సీలంటే భయం. బీజేపీకి అమరుల స్థూపాలంటే భయం. అందుకే కాంగ్రెస్ జెండాలు చింపుతుంటే, బీజేపీ అమరుల స్థూపాలను కూల్చుతున్నది. నాడు విప్లవ పార్టీలు ప్రజలను చైతన్యం చేస్తే, మలిదశ ఉద్యమంలో బీఆర్ఎస్ తెలంగాణ సమాజాన్ని చైతన్య పరిచింది. అందుకే జాతీయ పార్టీలైన ఈ రెండింటికీ బీఆర్ఎస్ అంటే భయం పట్టుకున్నది.

'ఎరుపంటే ఎందరికో భయం భయం.. పసిపిల్లలు వారికంటే నయం నయం' అన్నారు విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు గులాబీ రంగంటే భయం భయం అన్నట్టుగా తయారైంది. గాయపడిన సింహం నుంచి వచ్చే శ్వాస గర్జన కంటే భయంకరంగా ఉంటుంది. తేనె పూసిన కత్తిలాంటి మాటలు నమ్మి మోసపోయి గాయపడిన తెలంగాణ ప్రజల ఆగ్రహ జ్వాలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మటుమాయం కావడం తథ్యం.

లీ ఎంట్రీ!

కోట్ల వెంకటేశ్వర రెడ్డి,
94402 33261

అవునబ్బా
మనం చేసింది చిన్న గాయం కాదు
అతను వెంటపడి ప్రేమిస్తుంటే
నిర్మొహమాటంగా బ్రేకప్ చెప్పేస్తిమి!

మన ఆపతి గుర్తెరిగిన వాడిని
ఆపద కాలంలో స్మరిస్తుంటే
చేతులు కాలాక
ఆకులు పట్టుకున్నట్లున్నది!

పెద్ద కాలం ఏం కాలేదు కానీ
కొంపలు కూల్చడం చూశాం
మూసీ నది మీద ఎనలేని ప్రేమలు చూశాం
ఇంకా ముక్కు మూసుకొని కూర్చోవాలా?

నమ్మడం తప్పు కాదు
నమ్మించి మోసం చేయడమే తప్పు
గ్రాఫ్ పడిపోతున్నప్పుడు
దబాయింపులు వెకిలి చేష్టలే!

రాజకీయాలు
ఎప్పటికీ శాశ్వతం కావు
మనిషిని మట్టిని నమ్ముకున్న వాడు
లీయెంట్రీ ఇస్తానంటే వెల్కమ్ చెప్పాల్సిందే!

పనామా ప్రకంపనలు

డాక్టర్ సుంకర రమేశ్
9492180764

డొనాల్డ్ ట్రంప్ అమెరికాకు రెండోసారి అధ్యక్షుడైన నాటి నుంచి అనేక అంశాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నారు. ప్రపంచ ఆధునిక ఏడు వింతల్లో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన పనామా కాల్వ గురించి తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. ప్రపంచ పటంలో సెంట్రల్ అమెరికాలో ఉన్న దేశమే పనామా! 16వ శతాబ్దం నుంచి స్పానిష్ కాలనీగా ఉండి 1821 దాకా కొనసాగింది. ఆ తర్వాత కొలంబియా, వెనిజులా, ఈక్వెడార్‌లతో రిపబ్లిక్ గ్రాన్ కొలంబియాలో భాగంగా ఉన్నది. 1903లో స్వతంత్ర దేశంగా అవతరించింది.

శతాబ్దాల అనంతరం పనామా కాల్వను వెనక్కు తీసుకుంటామని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి. దీంతో పనామా కాల్వ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి యావత్ ప్రపంచానికి కలిగింది. 1513 నుంచి అనేక దేశాలు, వ్యక్తులు, సాహసికులు ఈ ప్రయత్నాలు చేశారు. పనామా దగ్గర ఉన్న ఇస్తుమస్‌ను బల్‌బో దాటారు. 1534లో 5వ రోమన్ చక్రవర్తి చార్లెస్ పనామా కాల్వ సర్వేకు ఆదేశించారు. స్పెయిన్ నుంచి పెటా దాకా రవాణాకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. 1668లో ఇంగ్లిష్ తత్వవేత్త, వైద్యుడు సర్ థామస్ ఇస్తుమన్ దగ్గర పనామా కాల్వ నిర్మాణం అనుకూలమని ప్రతిపాదన చేశాడు. ఇట్లా అనేక ఏండ్లు పనామా ఆలోచనలు కొనసాగాయి. రాజ్యాలు, వ్యక్తులు, పరిశోధకులు ఈ ఆలోచనలను కొనసాగించారు. మనిషి పట్టుదల, సాహసానికి కూడా పనామా కాల్వ నిర్మాణం నిదర్శనం.

> **1870లో అప్పటి అమెరికా అధ్యక్షుడు యూలిసెస్ ఎస్.గ్రాంట్ కెనాల్ కమిషన్ ఏర్పాటుచేశారు. చీఫ్ ఇంజినీర్ ఆండ్రూ వంటి వారితో కూడిన ఈ కమిషన్ సెంట్రల్ అమెరికాలో నికరగ్వా దగ్గర అనువైన మార్గాన్ని ప్రతిపాదించింది. 1881లో ఎన్నో అవాంతరాల తర్వాత మళ్లీ ప్రయత్నాలు కొనసాగాయి.**

ఎత్తయిన కొండల మధ్య నిర్మాణం కష్టసాధ్యమైంది. కొండలను తొలచటం, పనామా అడవుల్లోని విషకీటకాలు, దోమల ధాటికి నిర్మాణంలో శ్రామికులు మృత్యువాతపడ్డారు. ఖర్చు తడిసి మోపెడు కావటం, కొండలను తొలచటం వృథా అని నిర్ణయానికి వచ్చిన ఫ్రాన్స్ కంపెనీ 1889లో ఈ నిర్మాణ బాధ్యతల నుంచి తప్పుకున్నది. తదనంతరం అమెరికా 1904లో పనామా కాల్వ నిర్మాణ సారథ్యం స్వీకరించింది. ఈ సారి వినూత్న ఆలోచనలు చేసింది. సాంకేతిక పాటవాన్ని ఉపయోగించి మానవ మేధకు పదును పెట్టింది. సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణల్లో ముందుండే అమెరికా ఈ సారి విజయతీరాలను పనామా చేరుకొనేటట్లు అద్భుత నిర్మాణ ప్రతిభను ప్రదర్శించింది. లిఫ్ట్ పద్ధతి ద్వారా ఒక కృత్రిమ కాల్వను నిర్మించి నీళ్లను లిఫ్ట్ చేసి ఓడలను పైకి, కిందికి దింపే పద్ధతి, గేట్లు మూయడం, తెరవడం ద్వారా ఒక ఆధునిక ఇంజినీరింగ్ పద్ధతిని ప్రవేశపెట్టి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఈ సముద్ర మట్టానికి 85 అడుగులు ఎత్తున దీన్ని నిర్మించారు. 1914లో పనామా కాల్వను ప్రారంభించారు. 1977లో టారిజోస్-కార్టర్ ఒప్పందం చేసుకోవటం ద్వారా పనామా కాల్వ నిర్వహణను ఒక అథారిటీ నిర్వహిస్తున్నది. ఈ మార్గం గుండా ఏటా 14 వేల షిప్‌లు వెళ్తూ ప్రపంచ వాణిజ్య వికాసాన్ని కొత్త పుంతలు తొక్కించింది. ప్రధానంగా అమెరికా, చైనా, చిలీ, జపాన్, దక్షిణ కొరియా దేశాలు పనామా కాల్వను గణనీయంగా ఉపయోగించుకుంటున్నాయి. ఇదిలా ఉంటే పనామా కాల్వ నిర్మాణం గురించి తెలుసుకోవడం కూడా ఒక చరిత్రే.

33 ఏండ్ల కల పనామా కాల్వ నిర్మాణం. దీని నిర్మాణంలో 27,600 శ్రామికులు మృత్యువాత పడ్డారు. 200 క్యూబిక్ మెట్రిక్ టన్నుల మట్టిని ఎత్తిపోశారు. విష కీటకాలు, మలేరియా బారినపడి వేలాది శ్రామికులు ఆ మట్టిలోనే కలిసిపోయారు. ఇంతటి ఘన చరిత్రను సొంతం చేసుకున్న పనామా కాల్వను డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తీసుకుంటానని ప్రకటిస్తున్నారు.

చైనా ప్రాబల్యం పనామా కాల్వ నిర్వహణలో పెరిగిపోతున్నదని అమెరికా అక్కసు వెళ్లగక్కుతున్నది. అయితే పనామా కాల్వ నిర్వహణలో చైనా భాగస్వామ్యం ఏమీ లేదు. పోర్టుల నిర్మాణంలో హాంకాంగ్ కంపెనీలు పాలుపంచుకుంటున్న విషయం తెలిసిందే. అది వాణిజ్య అంశం వ్యాజ్యం కాదు. కాంట్రాక్ట్ దక్కించుకున్న ఏ దేశ కంపెనీలైనా నిర్మించవచ్చు. ఎవరూ ఆక్షేపించలేరు. అందుకే ట్రంప్ అన్ని దేశాల్లో తలదూరుస్తూ తన మాట నెగ్గించుకోవాలన్న పంతం వీడనాడాలి.

అయితే, పనామా కాల్వ ద్వారా ఆ దేశం భారీగా సుంకాలు రాబడుతున్నదని అమెరికా ఆరోపిస్తున్నది. తన సరుకు రవాణా స్వయం పెరుగుతున్నదని అమెరికా కొత్త రాగం ఎత్తుకున్నది. పనామా కాల్వను తిరిగి తీసుకుంటామని, అమెరికా ఆధిపత్య ప్రకటన చేసింది. అయితే, ఎప్పుడో పనామా దేశానికి ఒప్పందం ద్వారా ఇవ్వబడిందని అమెరికా మర్చిపోయింది. ఈ దురహంకార ప్రకటనను పనామా తీవ్రంగా ఖండించింది. పనామా కాల్వ పనామా నేలపై పారుతుందని ఇది అమెరికా సొత్తు కాదని గట్టిగా బదులిచ్చింది. పనామా కాల్వలోని ప్రతి చదరపు మీటర్, దాని చుట్టు పక్కల ప్రాంతం కూడా తమదేనని, పనామా సార్వభౌమాధికారం, స్వాతంత్ర్యం విషయంలో ఎటువంటి రాజీ ఉండదని ఆ దేశ అధ్యక్షుడు బోస్ రౌల్ మునిలో బదులిచ్చాడు. పనామా కాల్వ భారీ ఓడల సరుకు రవాణాకు కీలకం. అందుకే దీన్ని 'దుబాయ్ ఆఫ్ లాటిన్ అమెరికా' అంటారు. పనామా కాల్వను విస్తరించడానికి కోట్ల డాలర్లను పనామా వెచ్చిస్తున్నది. ఎలాంటి అడ్డంకులు రాకుండా ఉండటానికి పనామా కాల్వ సైజులో ఓడలు నిర్మిస్తున్నారు. భారీ పెట్టుబడులు పెట్టడం ద్వారా చైనా పనామాకు సన్నిహితంగా మ